





నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

ఆదివారం 22 మార్చి 2026 | పేజీలు 8


# రైజ్ కేంద్రానికి నీతి ఆయోగ్ పట్టం

- రూ. 1.55 కోట్ల ఆర్థిక మద్దతుకు ఉత్తర్వులు
- మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు విలువైన చేయూత
- గౌరవ సీఎం నిత్యనూతనం-వినూత్నం నినాదానికి అనుగుణంగా అడుగులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ






**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 21, మేజర్ న్యూస్ :** స్వర్ణాంధ్ర విజన్ @ 2047, వికసిత్ భారత్ సాకారం దిశగా చేస్తున్న వినూత్న ప్రయత్నాల్లో భాగంగా ఆకాంక్షిత బ్లాకు అయిన ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో జిల్లా యంత్రాంగంఏర్పాటు చేసిన రూరల్ ఇన్నొవేషన్స్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్ (రైజ్) కేంద్రానికి నీతి ఆయోగ్ పట్టంకట్టిందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు చేపడుతున్న కార్యక్రమాలకు రూ.1.55 కోట్ల ఆర్థిక మద్దతుకు ఆమోదం తెలుపుతూ తాజాగా ఉత్తర్వులిచ్చినట్లు వెల్లడించారు. రైజ్ కేంద్రానికి నీతి ఆయోగ్ ఆర్థిక మద్దతుపై కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలను మిగతా 2లో

# రైతు సంక్షేమమే లక్ష్యం

## కేడీసీసీ చైర్మన్ నెట్టేం రఘురామ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**విజయవాడ, మేజర్ న్యూస్ :** కోనయాపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతుల అభివృద్ధి, వ్యవసాయ బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తూ రూ.1 కోటి 30 లక్షల రుణ పంపిణీ చెక్కులను ఉమ్మడి కృష్ణా జిల్లా కేడీసీసీ చైర్మన్ నెట్టేం రఘురామ్ , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా ప్రతిబింబించింది. పంటల సాగు, ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం ఈ రుణాలు ఉపయోగపడతాయని నాయకులు తెలిపారు. కేడీసీసీ చైర్మన్ నెట్టేం రఘురామ్ మాట్లాడుతూ సహకార రంగం రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. తక్కువ వడ్డీపై రుణాలు మిగతా 2లో...

# 15ఏళ్ల నిరీక్షణకు తెర

## రామవరప్పాడులో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం

## ఎమ్మెల్యే యార్లగడ్డ

**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో గత 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కట్టపై రహదారి సమస్యకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరిష్కారం చూపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, ఈ ప్రాంతంలో బీటీ (టీ) రోడ్డు పనులను స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రారంభించి, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు ప్రాంతాల్లో కట్టలపై నివసిస్తున్న సుమారు 20 వేల మందికి రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇంతకాలం సరైన రహదారి లేక ప్రజలు హైవేకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేక ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పని చేసిన ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, అయితే యార్లగడ్డ వెంకట్రావు గెలిచిన వెంటనే స్పందించి పనులు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే వారి దీర్ఘకాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంతో పాటు ప్రాంతీయ అభివృద్ధిపై కూడా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. రామవరప్పాడులో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన మోడ్రన్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, పేద ప్రజలకు తక్కువ ధరలో భోజనం అందించేందుకు త్వరలోనే అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.



(మొదటిపేజీ తరువాయి)



## రైతు సంక్షేమమే లక్ష్యం

అందించడం ద్వారా రైతుల ఆర్థిక భారం తగ్గుతుందని, సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అని, రైతు అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి రైతు కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడం ద్వారా వారి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రుణ చెక్కులు అందుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, సమయానికి అందిన ఈ సహాయం పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురామ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మార్నాపూడి వెంకట్రావమ్మ, ఎంపీటీసీ గుత్తికొండ కల్పన, సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి ప్రసాద్, లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలా ప్రసాద్, రైతు నేతలు, కూటమి నాయకులు, స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు

**మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్**



**ఉయ్యూరు, మేజర్ న్యూస్ :** రంజాన్ పండుగ సందర్భంగా ఉయ్యూరు లోని పెద్ద మసీదు సెంటర్‌లోని షేక్ బుడ అండ్ సన్స్ టైర్ ల షాప్ వారి ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లి ముస్లిం సోదరులకు రాజేంద్రప్రసాద్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా ఈ నెల రోజులు రంజాన్ మాస ఉపవాసాలు పూర్తిచేసుకుని ఈరోజు రంజాన్ పండుగ చేసుకుంటున్న శుభ సందర్భంగా వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని, అల్లాహ్ దయ వల్ల అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో విక్రుతి రాజా, షేక్ భాషి, తెలుగు యువత నాయకుడు కరీం బెగ్, జబి, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రైజ్ కేంద్రానికి నీతి ఆయోగ్ పట్టం



(మొదటిపేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు గౌరవ సీఎం ఆకాంక్ష అయిన ఒక కుటుంబం -ఒక పారిశ్రామికవేత్త స్ఫూర్తికి అనుగుణంగా అడుగులు వేసి వినూత్నంగా రైజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా రూపొందించిన ఈ వినూత్న కార్యాచరణ ప్రణాళికకు నీతి ఆయోగ్ నుంచి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రైజ్ కేంద్రం ప్రణాళికపై నీతి ఆయోగ్‌కు సవివర నివేదిక పంపగా పరిశీలించి ఆర్థిక మద్దతుకు ప్రత్యేక కమిటీ ఆమోదం తెలిపినట్లు వివరించారు. ఈ నిధులు ఇబ్రహీంపట్నం బ్లాకులో ఏఐ ఆధారిత నైపుణ్య సర్వే, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితరాలకు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ మద్దతు మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు పెద్ద చేయూత అని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**ఏఐ సహా విభిన్న అంశాల్లో శిక్షణ**

గౌరవ ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్న "నిత్య నూతనం వినూత్నం" నినాదానికి అనుగుణంగా మరిన్ని సృజనాత్మక కార్యక్రమాలను అమలు చేస్తామని, మహిళలు అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేలా టీమ్ ఎన్‌టీఆర్ కృషిచేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రైజ్ కేంద్రంలో హెల్ప్ డెస్క్, ఐడియా డెస్క్, స్కిల్లింగ్ డెస్క్, ప్లేస్‌మెంట్ డెస్క్, బ్యాంకింగ్ డెస్క్ లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్ని రకాల సేవలు ఒకేచోట అందేలా రైజ్ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

రైజ్ కేంద్రంలో ఇప్పటికే వెయ్యిమందికి పైగా మహిళలకు ఏఐ, స్పోకెన్ ఇంగ్లిష్, పేపర్ క్రాఫ్ట్, కార్ డ్రైవింగ్, మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్, సోలార్ ప్యానెల్ ఫిక్సింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), ఏ2 ఫీ వంటి వాటిపై వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించినట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలను, రైజ్ కార్యాచరణను సద్వినియోగం చేసుకొని 300 కుటుంబాలకు పైగా ఇప్పటికే వివిధ యూనిట్లు ప్రారంభించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగారన్నారు. రైజ్ కేంద్రంలో విభిన్న అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని.. ప్రతివారం వివిధ అంశాల్లో వర్క్‌షాప్‌లు సైతం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు మహిళలను క్షేత్ర పర్యటనలకు కూడా తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అలీప్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్‌టీఐహెచ్ తదితరాలతో కూడా చేతులు కలిపామన్నారు. రైజ్ కేంద్రంలో ప్రతినెలా ఎన్‌టీఆర్ వికాస ద్వారా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాజా విజయానికి సహకరించిన గౌరవ ముఖ్యమంత్రి, స్థానిక పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, సెర్ప్ అధికారులు, మీడియా ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రైజ్‌ను సద్వినియోగం చేసుకోవాలనుకునే ఔత్సాహికులు 70753 85588 నంబరులో సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో డి.శకుంతల, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, రైజ్ మేనేజర్ బి.తేజస్విని పాల్గొన్నారు.


## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సత్తా చాటుతున్న విజయకుమార్‌కు జన్మదిన వేడుకలు

**హనుమాన్ జంక్షన్, మార్చి 21, మేజర్ న్యూస్ :** శాస్త్ర సాంకేతిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని సొంతం చేసుకుని ముందంజలో ఉన్న చక్రపాణి విజయ కుమార్ అభినందనీయుడని సీనియర్ జర్నలిస్ట్, లయన్ తాడి రంగారావు పేర్కొన్నారు. హనుమాన్ జంక్షన్ ఫోటోగ్రాఫర్స్ & వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, వైష్ణవి స్టూడియో అధినేత అయిన చక్రపాణి విజయకుమార్ జన్మదిన వేడుకలను శనివారం రాత్రి హనుమాన్ జంక్షన్‌లో మిత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడి రంగారావు మాట్లాడుతూ, ప్రస్తుత ట్రెండ్‌లో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విజయ కుమార్ ప్రావీణ్యం సాధించి, భావితరాలకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కళ్ళేపల్లి నారాయణరావు, గంటా శ్రీనివాస్, అంబళ్ళ వెంకట రంగారావు, మోగంటి వేంకటేశ్వరరావు (కొండ), వేల్పూరి రంగబాబు, గార్లపాటి రాజేశ్వరరావు, తవ్వా సురేష్, పింగళి జోజిబాబు, కోలపల్లి



మల్లేశ్వరరావు, కొప్పుల మహేష్, వీర్ల జోజిబాబు, వల్లభనేని ప్రభాకరరావు, దాసరి కళ్యాణ్, లక్కపాముల అమృతరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు



**ఫలితాలను ఇస్తోన్న 21 నెలల కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు**

**అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమకు శంకుస్థాపన**

**కేంద్రమంత్రులతో కలిసి ఈనెల 23న సీఎం చంద్రబాబు భూమిపూజ**

**రూ.1,35,964 కోట్ల పెట్టుబడి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షమందికి ఉద్యోగావకాశాలు**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిలో మరో చారిత్రాత్మక అడుగు పడుతోంది. ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా) సంస్థ 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్ధ్యంతో రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పుడానికి సిద్ధమైంది. దీనికి ఈనెల 23న అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో కేంద్రమంత్రులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నారు. రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. 5,465 ఎకరాల్లో మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టు సాకారం కానుంది. మొదటి దశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్ధ్యంతో ఉక్కు ఉత్పత్తి చేయనుంది.

**క్యాప్టివ్ పోర్టుతో మరో 6 వేల ఉద్యోగాలు**

స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా 50 మి.మె.ట సామర్థ్యంతో అదనంగా 316 ఎకరాల్లో క్యాప్టివ్ పోర్టును కూడా ఏఎంఎన్ఎస్ ఇండియా ఏర్పాటు చేయనుంది. దీని కోసం ప్రత్యేకంగా రూ.11,198 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీంతో మరో 6,000 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏఎంఎన్ఎస్ ఇండియా ప్లాంట్ ఏర్పాటుతో విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిశ్రమల హబ్‌గా రూపుదిద్దుకోనుంది. గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా దేశంలో భారీగా పెరిగిన ఉక్కు మార్కెట్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఏఎంఎన్ఎస్ ఇండియాకు లభించనుంది.

**అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వ సహకారం**

ఈ ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. స్టీల్ ప్లాంట్‌ను ఎన్‌హెచ్-16తో కలిపేలా 4 లేన్ రహదారి విస్తరణ పనులు చేపట్టింది. కనెక్టివిటీ పెంచడంతో పాటు పరిశ్రమకు అవసరమయ్యే నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు శరవేగంగా కల్పిస్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

సోమవారం జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారు. అలాగే కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

ఇంకా ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టి.జి. భరత్, ఎంపీ సి.ఎం. రమేష్ విశిష్ట అతిథులుగా హాజరవుతారు. ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ భూమి పూజలో పాల్గొంటారు. సోమవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి నేరుగా నక్కపల్లి మండలం రాజయ్యపేటకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. మధ్యాహ్నం 3.40 గంటలకు ఎక్స్‌పీరియన్స్ జోన్ సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ మోడల్‌ను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకం ఆవిష్కరిస్తారు. అలాగే అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు.

# ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా స్పందనలో సేవా స్ఫూర్తి వెలుగులు

## దివ్యాంగ బాలలకు సేవలు అందించడం స్పందన యొక్క సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తుంది : 'డాక్టర్ శ్రావ్య చందన




**గన్నవరం, మార్చి 21, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం దావాజిగూడెంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ డీ.ఈ.డీ స్పెషల్ ఎడ్యుకేషన్ కాలేజి (ఐ.డీ.డీ), స్పందన మానసిక వికాస కేంద్రంలో సంయుక్తంగా ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు, దివ్యాంగుల సంక్షేమానికి సమాజం బాధ్యతను గుర్తు చేసే కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రావ్య చందన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 21న ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఈ దినోత్సవం ద్వారా డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన పెంచడం ప్రధాన లక్ష్యమని ఆమె వివరించారు. 21వ క్రోమోజోమ్‌లో లోపం కారణంగా డౌన్ సిండ్రోమ్ ఏర్పడుతుందని, దీని వల్ల మానసిక, శారీరక అభివృద్ధిలో ఆటంకాలు ఎదురవుతాయని డాక్టర్ పేర్కొన్నారు. స్పందన మానసిక వికాస కేంద్రం ద్వారా దివ్యాంగ పిల్లలకు ఉచిత విద్య, వైద్య సేవలు, రవాణా, భోజన సౌకర్యాలు అందించడమే కాకుండా ఉన్నత విద్య తో పాటుగా కంప్యూటర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అందించడం నిజంగా ప్రశంసనీయమని, నిరంతరం దివ్యాంగుల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీకి చేయూత అందించాలని డాక్టర్ శ్రావ్య చందన పిలుపునిచ్చారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి దివ్యాంగ బాలలకు సేవలు అందించడం ఈ సంస్థ యొక్క సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తుందని డాక్టర్ శ్రావ్య చందన తెలిపారు. గన్నవరం లక్ష్మమ్మ స్మైల్ అండ్ షైన్ డెంటల్ కేర్ అధినేత డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ కి పౌష్టికాహారం లోపం, వారసత్వ కారణాలు, పర్యావరణ ప్రభావాలు, గర్భధారణ సమయంలో వైద్యుల సలహాలను నిర్లక్ష్యం చేయడం వంటి అంశాలు కారణమవుతాయని ఆయన తెలిపారు. డౌన్ సిండ్రోమ్ నివారణకు, ప్రభావం తగ్గించేందుకు సరైన అవగాహన, పోషకాహారం, క్రమం తప్పని వైద్య పరీక్షలు, డాక్టర్ల సూచనలు పాటించడం అత్యంత అవసరం అని స్పష్టం చేశారు. ఇలాంటి పిల్లలకు తల్లిదండ్రుల సహకారం, సమాజపు అంగీకారం, స్పందన మానసిక వికాస కేంద్రం వంటి స్వచ్ఛంద సంస్థల మద్దతు ఎంతో కీలకమని, ఈ సమాజం మనుగడ ఇలా అయిన ఉందంటే హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ వంటి సంస్థ కృషి సహాయమని డాక్టర్ సంపత్ కుమార్ అన్నారు.

ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ మాట్లాడుతూ, డౌన్ సిండ్రోమ్ గల బాలల సమగ్ర అభివృద్ధికి స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, అక్యూపేషనల్ థెరపీ, కౌన్సిలింగ్, సకాలంలో ప్రత్యేక విద్య అందించడం అత్యంత అవసరమని ఆమె తెలిపారు. ఈ సేవల ద్వారా పిల్లల మానసిక–శారీరక సామర్థ్యాలు మెరుగు పడి, వారు స్వావలంబన దిశగా అడుగులు వేయగలరని రజిత వెంకట్ వివరించారు. గన్నవరం ప్రాంతంలో లక్ష్మమ్మ స్మైల్ అండ్ షైన్ డెంటల్ కేర్ లో డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో అందరికీ అందుబాటులో అత్యాధునిక పరికరాలతో, నిపుణులైన డాక్టర్ల చేత పళ్ల ఆరోగ్యం, అందమైన స్మైల్ కోసం విశ్వసనీయమైన డెంటల్ సేవలు అందించబడుతున్నాయని రజిత వెంకట్ అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, దినేష్ రాణి, హెల్పింగ్ హ్యాండ్స్ డీ.ఈ.డీ స్పెషల్ ఎడ్యుకేషన్ కాలేజి(ఐ.డీ.డీ) సిబ్బంది, విద్యార్థులు, స్పందన మానసిక వికాస కేంద్రం బాలలు, వారి తల్లిదండ్రులు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## లయన్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షా శిబిరం

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక లయన్స్ సర్వీస్ సెంటరులో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం జరిగింది. లయన్ క్లబ్ పెద్దలు దుబ్బుల సాంబశివరావు ఆర్థికసహాయంతో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ వెంకట్రావ్ 40 మందిని పరీక్షించి 10మందిని ఐఓఎల్ ఆపరేషన్లకు ఎంపికచేశారు. లయన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముమ్మనేని నాని, వరదా హరిగోపాల్, నర్రా సాయిబాబు, జడిసి మోపిదేవి వెంకటేశ్వరరావు, రాయపాటి రాధాకృష్ణ, ఉప్పల సాంబశివరావు, ఉప్పల నాంచారయ్య, ఎంవి.కృష్ణారావు, పరిశ జలంధర్, అంబటి బసవ శంకరావు, కస్తూరి ప్రసాద్‌లు శిబిరంలో పాల్గొని పర్యవేక్షించారు.

## వీరవల్లిలో వెల్లువిరిసిన భక్తిపారవశ్యం

### ఘనంగా సాయిబాబా 25వ వార్షికోత్సవం



**హనుమాన్ జంక్షన్, మార్చి 21 (మేజర్ న్యూస్):** బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో వెలసిన శిరిడి సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకలు శనివారం భక్తి పారవశ్యంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావ రణం సంతరించుకుంది. బాబా వారికి విశేషంగా అష్టోత్తర పూజలు, మనోహరమైన పుష్పాలంకరణ సేవలు నిర్వహించారు. రంగన్నగూడెం ముకుంద భజన సమాజం సభ్యులు ఆలపించిన సంకీర్తనలు భక్తులను భక్తి రసంలో ముంచెత్తాయి. ఆలయ ప్రాంగణమంతా గానామృతం నిండిపోవడంతో భక్తులు తన్మయత్వంతో బాబా సేవలో తలమునకలయ్యారు. అనంతరం ఉదయం 11:30 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 3,000 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ వేడుకలను విజయవంతం చేయడంలో ఆలయ కమిటీ సభ్యులు కోడేబోయిన బాబి, రావి ఈశ్వర్, లంక సరోజినీ దేవి, తవ్వ ఆదిలక్ష్మి, జి నాగమణి, లంక పద్మశ్రీ, బేబీ సరోజినీ తదితరులు ముఖ్య భూమిక పోషించారు. గ్రామస్థులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బాబా వారి కృపకు పాత్రులయ్యారు.



## ఉగాది పురస్కారం అందుకున్న పీఎంఎస్‌కు సత్కారం

**పామర్రు మేజర్ న్యూస్ :** సమాజ సేవే పరమావధిగా భావిస్తూ రచయితగా, సోషల్ వర్కర్‌గా సేవలు అందించే పామర్రుకు చెందిన పి.ఎం.ఎస్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకోవడం అభినందనీయమని ప్రముఖ న్యాయ వాది, అంబేద్కర్ సంఘాల సమాఖ్య కన్వీనర్ పులి శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఉగాది పురస్కార గ్రహీత ప్రసాద్ ను పామర్రు లో అంబేద్కర్, బోధి సత్వ సంఘాల నేతలు సన్మానించారు, నందిపు నాంచారయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో ఇంతేటి వెంకట్, బిఎస్పి నేత భాను, రాఘవులు, గంగాధర్, జార్జి తదితరులు పాల్గొని ప్రసాద్‌ను సత్కరించి ఆయన సేవలను కొనియాడారు.

## ఏసుబాబు భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళి



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని వేల్పూరు గ్రామంలో చీకుర్తి ఏసుబాబు హఠాన్మరణం చెందగా శనివారం పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆయన పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏసుబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఘంటా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకలలో పాల్గొన్న వర్ల, వీరంకి



**పామర్రు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కొరిమెర్ల గ్రామంలో శనివారం జరిగిన మట్టా జమదగ్ని గృహప్రవేశ వేడుకలలో పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా, కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం పూజా కార్యక్రమంలో కూడా వీరు పాల్గొన్నారు. అనంతరం జమదగ్ని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గన్నవరం, రామవరప్పాడుల్లో ఆధునిక పోలీస్ స్టేషన్లు

## శాంతిభద్రతలకు విప్ యార్లగడ్డ వెంకట్రావు కట్టుబాటు



**గన్నవరం, మార్చి 21, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, ఎటువంటి విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరించారు. శనివారం గన్నవరం ఎయిర్పోర్ట్ లో గన్నవరం డిఎస్పి చలసాని శ్రీనివాస్, గన్నవరం సీఐ శివ ప్రసాద్, హనుమాన్ జంక్షన్ సీఐ ఎల్.రమేష్, ఆత్కూరు ఎస్ఐ లక్ష్మీ నరసింహామూర్తి లతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన శాంతిభద్రతలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న గన్నవరం పోలీస్ స్టేషన్‌ను అన్ని సదుపాయాలతో కూడిన ఆధునిక పోలీస్ స్టేషన్‌గా అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తన హయాంలోనే ఈ నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. ఈ నిర్మాణానికి ప్రభుత్వంపై భారం పడకుండా సిఎస్ఆర్ నిధులు, ఎన్నారైల సహకారంతో నిధులను సమీకరించి, త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఇందుకోసం గన్నవరం పోలీస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ.3 కోట్ల తో రూపొందించిన ప్లాన్ ను (జి+3 బిల్డింగ్) ఆయన స్వయంగా పరిశీలించారు. విజయవాడ రూరల్ పరిధిలోని 9 గ్రామాల ప్రజల సౌకర్యార్థం రామవరప్పాడులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన స్థల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ఈ కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగి, పోలీస్ సేవలు మరింత త్వరగా, సులభంగా అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆత్కూరులో నూతనం గా నిర్మించిన పోలీస్ స్టేషన్ ను త్వరలో హోమ్ మంత్రి అనితతో కలసి ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజల భద్రతే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యతని యార్లగడ్డ వెంకట్రావు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# రంజాన్ పర్వదినాన మత సామరస్యానికి నిదర్శనం





## మజీద్ పునర్నిర్మాణానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల నుంచి రూ.2.60 లక్షల విరాళం



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** రంజాన్ పర్వదినం సందర్భంగా విజయవాడ రూరల్ మండలం పి. నైనవరం గ్రామంలో మత సామరస్యాన్ని ప్రతిబింబించే హృద్యమైన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గన్నవరం మాజీ శాసన సభ్యులు వల్లభనేని వంశీ మోహన్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కొమ్మ కోట్లు సూచనల మేరకు మజీద్ పునర్నిర్మాణానికి పార్టీ నాయకులు ఉదారంగా విరాళాలు అందించారు. మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంగజాల హనుమాన్, యార్కా రెడ్డి నాగిరెడ్డి, కలకోటి బ్రహ్మానంద రెడ్డి, బి. శివరామిరెడ్డి, ఓంకార్ రెడ్డి, కలపాల అబ్రహం, నల్లమోతు చంద్రశేఖర్ రెడ్డి, గొన్నూరు సీనయ్య కలిసి రూ.1,00,000 విరాళంగా అందించారు. నున్న గ్రామ మాజీ వైస్ ఎంపీపీ జీతం శ్రీనివాసరావు 50,000 రూ, నైనవరం గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావు వెంకటేశ్వరరావు (డివిఆర్) 50,000 రూ, గ్రామ పంచాయతీ సర్పంచ్ బట్టా సోమయ్య 50,000 రూ, విరాళం అందించారు. మాజీ సర్పంచ్ దావు వీర కోటయ్య రూ.10,000 విరాళంగా అందించగా, మొత్తం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.2,60,000 మజీద్ పునర్నిర్మాణానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఇమామ్ అబ్దుల్ జాహెద్, మజీద్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సమాజ సేవా భావంతో విరాళాలు అందించిన ప్రతి ఒక్కరిపై అల్లాహ్ కరుణ కటాక్షాలు ఉండాలని ప్రార్థించారు. మత భేదాలు లేకుండా సమాజ ఐక్యతను బలోపేతం చేసిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు. మజీద్ కమిటీ సభ్యులు వల్లభనేని వంశీకి, కొమ్మా కోట్లుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కోట మోషే, మండల సోషల్ మీడియా వైస్ ప్రెసిడెంట్ నందేటి చంద్రశేఖర్, దావు శ్రీనివాసరావు, కాళిదాసు, రామకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



### మసీదుల్లో రంజాన్ వేడుకలు

**మొవ్వ మేజర్ న్యూస్ :** మండలంలోని ముస్లిం సోదరులు శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాలనడుమ రంజాన్ వేడుకలు నిర్వహించారు. గతనెల రోజులుగా ఉపవాస దీక్షలతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ కొనసాగించిన రంజాన్ వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మసీదులలో నమాజుచేసి ఖురాన్ పఠించారు. అలాగే ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పేద వర్గాలకు దానధర్మాలు చేశారు. మండలంలోని కాజ, నిడుమోలు, పెదపూడి, భట్ల పెనుమర్రు, కోసూరు (తురకపాలెం), మొవ్వ గ్రామాల్లో గల మసీదుల్లో ముస్లిం భక్తులతో కళకళలాడాయి. అలాగే ఇమామ్‌లు భక్తిప్రవచనాలుతో కూడిన ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు. వయసుతో తారతమ్యం లేకుండా శుభాభినందనలు తెలుపుకున్నారు.

### ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** రంజాన్ పర్వదినాన్ని పరిష్కరించుకుని మండల పరిధిలోని లక్ష్మీపురంలో ముస్లిం సోదరులు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకుంటూ మిఠాయిలు పంపిణీ చేశారు. మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ అన్వర్ భాష, షేక్ అజిత్, కరీముల్లా, బాజీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ముస్లిం సోదరులకు మజ్జిగ పంపిణీ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థులు అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. శనివారం ఎండతీవ్రతగా ఉండగా, ప్రార్థనల అనంతరం ముస్లింలు చిన్నారులకు మజ్జిగను అందచేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు టి.సాంబశివరావు, పూర్వవిద్యార్థులు అబ్దుల్ జిలానీ, పాగోలు దుర్గాప్రసాద్, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, మోర్ల శివ, మేక రామకృష్ణ, పినిశెట్టి నిరంజన్, భరత్, వేపూరి నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొని సేవలందించారు. అనంతరం కోమలానగర్ లోనూ వాహనదారులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ జరిగింది. సుమారు 1000 మందికి మజ్జిగ పంపిణీ చేయగా, పూర్వవిద్యార్థుల సేవాకార్యక్రమాన్ని ముస్లిం సోదరులు, ప్రజలు అభినందించారు.

## నగరంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

### రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న మంత్రి రవీంద్ర



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నగరంలో శనివారం రంజాన్ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, టిడిపి రాష్ట్ర నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లయ్య) గొర్రెపాటి గోపీచంద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ హసీం బేగ్ పలువురు కూటమి నాయకులు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పెద్ద ఎత్తున రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా ఒకరికొకరు శుభాకాంక్షలు శుభాభినందనలు తెలుపుకున్నారు. మహిళలు కూడా రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ సేమియా సేవించారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన రంజాన్ మాసం అంతా ముస్లింలందరూ నియమనిష్టలతో నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించారు. వారి వారి శక్తి మేరకు దానధర్మాలు చేశారు. రంజాన్ పర్వదినం ముస్లిం సోదరుల కుటుంబాల్లో సుఖసంతోషాలు ఆయురారోగ్యాలు వెల్లి విరియాలని అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని అందరూ ఐకమత్యంతో కులమతాలకు అతీతంగా సోదరభావంతో అభివృద్ధి చెందాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు.

## రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డా.హసీమ్ బేగ్‌కీ ఘన సత్కారం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పవిత్రమైన ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా సోదరభావం, మానవత్వం, సమైక్యతా సందేశాలు మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తూ స్థానిక ఇంగ్లీష్ పాలెంలో శనివారం రంజాన్ మాసంలో నెల రోజులపాటు ఉపవాస దీక్షలు పాటించి, ప్రార్థనలతో మనసును పవిత్రం చేసుకున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డా. హసీమ్ బేగ్ గృహంలో ప్రత్యేక సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బ్రాహ్మణ కార్యదర్శి వేమూరి వెంకట నాగ సాయి, సీనియర్ జర్నలిస్ట్, వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు కలిసి డా. హసీమ్ బేగ్‌ను ఘనంగా సన్మానించారు. మతం ఏదైనా మమకారం ఒక్కటేనని, ప్రేమను పంచడమే అసలైన దైవత్వం. నలుగురికి సాయపడటమే మనిషి సహజత్వం, అని హసీమ్ బేగ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రంజాన్ మాసంలో పేద ప్రజలకు సహాయం చేయాలని పవిత్ర ఖురాన్ సూచించిన మార్గాన్ని ఆచరణలో చూపిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. చందమామ బాబు మాట్లాడుతూ డా. హసీమ్ బేగ్ లాంటి సేవా భావం కలిగిన వ్యక్తులు సమాజంలో ఆధ్యాత్మిక విలువలను పెంపొందిస్తూ, మానవత్వాన్ని చాటుతున్నారని అన్నారు. ఈ రంజాన్ నెలలో అనేకమంది పేదలకు సహాయం అందించిన వ్యక్తి అని భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అలంకరించి, సేవా కార్యక్రమాలను విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలుము పలువురు బేగ్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

### చల్లపల్లిలో ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ముస్లింల పవిత్ర పర్వదినం ఈదుల్ ఫితర్ (రంజాన్) వేడుకలు శనివారం చల్లపల్లిలో ఘనంగా జరిగాయియి. చల్లపల్లి జామియా మసీదు, గౌసియా మసీదుల నుంచీ పెద్దఎత్తున ముస్లిం సోదరులు ప్రదర్శనగా పడమరవీధిలోని ఈద్గా మైదానానికి చేరుకున్నారు. ఖురాన్ గురువుతో కలిసి రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రపంచశాంతిని కాంక్షిస్తూ అల్లాను ప్రార్థించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం ముస్లింల స్మశానవాటికకు వెళ్లి పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు. మసీదు కమిటీ అధ్య క్షులు షేక్ నసీం ఘోరీ, ఎస్ఎం.ఎ. షరీఫ్, ముస్లిం నేతలు ముస్లిం సోదరులకు రంజాన్ శుభా కాంక్షలు తెలిపారు. వైసీపీ నేత కడవకొల్లు నరసింహారావు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేసి స్వీట్లు పంపిణీ చేశారు.



# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వ కట్టుబాటు







## రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమా

### ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బొండా ఉమ

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** 58వ డివిజన్ సింగ్ నగర్ షాదీ ఖానాలో, 63వ డివిజన్ రాజీవ్ నగర్ మస్జిద్-ఏ-నూరియా వద్ద రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మా మైనారిటీ ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు, ఈద్ ముబారక్ అని తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ, అత్యధిక బడ్జెట్‌ను కేటాయిస్తూ వారి సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. చిత్తశుద్ధితో మైనార్టీ సమాజ అభివృద్ధికి అంకితభావంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ నియోజకవర్గంలో రంజాన్ సందర్భంగా 10,000 కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్పొరేటర్లు, పోటీ చేసిన నాయకులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేసినట్లు అన్నారు. అదనంగా, ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం చేపట్టిన పలు కార్యక్రమాలను వివరించారు. మసీదుల అభివృద్ధి, మరమ్మత్తుల కోసం నిధుల మంజూరు, కబరిస్థాన్ల అభివృద్ధి పనులు, దర్గాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముస్లిం యువతకు విద్యా, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు పలు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాలు అందించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తున్నామని, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా విద్యలో ప్రోత్సాహం కల్పిస్తున్నామని తెలిపారు. స్వయం ఉపాధి కోసం రుణాలు, సబ్సిడీలు అందిస్తూ ముస్లిం కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని మైనార్టీ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు చేపట్టినట్లు తెలిపారు. పండుగల సమయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నామని అన్నారు. మైనారిటీ సోదరులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని బొండా ఉమ స్పష్టం చేశారు. మరొక్కసారి ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు, ఈద్ ముబారక్ అని ఆకాంక్షించారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు







**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మండల పరిధిలోని అలినఖిపాలెం, కపిలేశ్వరపురం, ఫత్తేలంక తదితర గ్రామాల్లోని మసీదులలో ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ ప్రార్థనలు చేశారు. 30 రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం ముస్లింలు ఈ పండుగను శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అలినఖిపాలెంలోని జామియా మస్జిద్‌లో పవిత్ర రంజాన్ ప్రార్థనలు జరిగాయి. జామియా మస్జిద్ లో మత గురువు మౌలానా మిర్జా ఇబ్రహీం అలీ ఇస్ఫెహాని ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# భవన నిర్మాణం త్వరగా చేపట్టాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ భవనానికి కేటాయించిన స్థలాన్ని శనివారం కూటమి నాయకులు, గొర్రెపాటి గోపీచంద్, పి.వి.ఫణి కుమార్, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు సందర్శించి, స్థల పరిశీలన చేసి భవన నిర్మాణం త్వరగా చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు. కృష్ణా జిల్లా గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.పట్టాభి స్మారక భవనానికి స్థలం కేటాయించినప్పటికీ వైసీపీ హయాంలో తీవ్రమైన అడ్డంకులు ఏర్పాటు చేశారని తెలిపారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ జిల్లా కలెక్టర్ తొలి సంతకంతో భవన నిర్మాణానికి అనుమతు లభించాయని తెలిపి హర్షం వ్యక్తం చేశారు. అధికార దుర్వినియోగంనకు పాల్పడిన వైసిపి నాయకులు ఆ పార్టీ కార్యాలయాన్ని పట్టాభి స్మారక భవనం స్థలం ప్రక్కన ఏర్పాటు చేసుకొని, పట్టాభి భవనం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు అన్నారు. జిల్లా కోర్టు జడ్జిలు సముదాయాల సమీపంలో వైసిపి పార్టీ కార్యాలయం నిర్మించి ప్రజలకు ఉపయోగపడే పట్టాభి స్మారక భవనానికి అన్యాయం చేసిన మాజీ మంత్రి పేర్ని నాని తో పాటు ఆ పార్టీ మేయర్, కార్పొరేటర్లు,అంతా ప్రజల నుంచి గుణపాటాన్ని ఎదుర్కోక తప్పదు అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్ మాట్లాడుతూ,వైసీపీ నేతలు ఎన్ని అడ్డంకులు పెట్టిన మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు ఇతర కూటమి నేతల సహాయ సహకారాలతో పట్టాభి స్మారక భవనాన్ని నిర్మించి తీరుతామన్నారు. ఐదేళ్లుగా అవస్థలు పెట్టిన మచిలీపట్నం నగరపాలక సంస్థ లో వైసిపి పాలకవర్గం గడువు ముగియడంతో పట్టాభి స్మారక భవనానికి మోక్షం కలిగిందన్నారు. పేర్ని నాని ఆ పార్టీ కార్పొరేటర్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని తీవ్రమైన ఆటంకాలు ఏర్పాటు చేశారని కోర్టు ఆదేశాలను సైతం అమలుచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారికి చంప దెబ్బగా మచిలీపట్నం నగరపాలక సంస్థలో ప్రత్యేక అధికారి పాలనలో అనుమతులు ఇప్పించేలా కృషిచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు, జిల్లాలోని ఇతర కూటమి ప్రజాప్రతినిధులకు ప్రజలందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు.అలాగే మచిలీపట్నం నగరపాలక సంస్థకు ప్రత్యేక అధికారిగా నియమితులైన మన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తొలి సంతకంగా ఈ ఫైల్ ఆమోదించడం పట్ల వారికి, హైకోర్టుకు కూడా వచ్చి పలు ఇబ్బందులు పడ్డ మున్సిపల్ కమిషనర్, సిహెచ్ వివిఎస్ బాపిరాజుకు, ఇతర అధికారులకు కూడా కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు. బిజెపి సీనియర్ నాయకులు దూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ, పట్టాభి సీతారామయ్య స్వాతంత్ర సమరయోధులని ఆయన మచిలీపట్నం నకు చేసిన సేవకు గుర్తుగా మెమోరియల్ నిర్మాణానికి ప్రభుత్వం ముందుకొస్తే వైసీపీ నేతలు సృష్టించిన అడ్డంకులు మరిచిపోలేనివి అని ఆయన తెలిపారు. పట్టాభి స్మారక భవనం నిర్మాణం కోసం చేసే మంచి పనిని మంత్రి కొల్లు రవీంద్ర ఎంపీ వల్లభనేని బాలశౌరి తదితర కూటమి నాయకులు చేసిన కృషి ప్రజలెవరు జీవితంలో మరిచిపోలేనిది అన్నారు.ఈ భవన నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు హరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధులు, దివ్యాంగులకు 1వ తేదీలోగా రేషన్ ఇవ్వండి

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** చౌక ధరలు దుకాణదారులు తమ పరిధిలోని వృద్ధులు వికలాంగులకు ఈనెల 26వ తేదీ నుండి వారి ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందించాలని తాసిల్దార్ బి.శ్రీను నాయక్ విజ్ఞప్తి చేశారు. పెదపారుపూడి తహసిల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లకు నిర్వహించిన సమావేశంలో తహసిల్దార్ మాట్లాడుతూ 65 సంవత్సరాలు దాటిన వృద్ధులందరికీ తప్పనిసరిగా ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలని సూచించారు. అలాగే ప్రతి రేషన్ షాప్‌లో అధికారుల ఫోన్ నెంబర్లు, సరుకుల వివరములు ధరల బోర్డులు ప్రదర్శించాలని, సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్యాలయ డిప్యూటీ తహసిల్దార్ కొడాలి ఏసు పాదం, రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మనలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ చేసిన బండి రామకృష్ణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం వారు ఏర్పాటుచేసిన చలివేంద్రంలో జనసేన పార్టీ మచిలీపట్నం ఇన్చార్జి డిసిఎం ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని శీతల పానీయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ రానున్న వేసవిని పురస్కరించుకొని చలివేంద్రంలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని స్వచ్ఛంద సంస్థలు మానవతావాదులు చలివేంద్రాలను ఏర్పాటు చేసి చేసి బాటసారులకు దాహార్తిని తీర్చాలన్నారు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రతినిధుల సేవను కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం కోశాధిపతి పెంట శివప్రసాద్, మచిలీపట్నం విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు మానేపల్లి కృష్ణమోహన్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు, కొల్లపల్లిగణేష్, వేములచక్రి, మానేపల్లి జ్ఞాన మణికంఠ ఆశ్రీత్, స్వర్ణకార నాయకులు గరుగుదుర్గాప్రసాద్, అర్జా కేదార్ జి.శ్రీనివాసరావు, గజ్జల ఆనంద్, పెంట శరశ్చంద్ర, అరటికట్ల మధునాగేంద్ర, యండీ సర్దార్, చెబ్రోలు రవి,కొల్లపల్లి గణేష్, వేములచక్రి, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి



**పామర్రు మేజర్ న్యూస్ :** పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. మండల పరిధిలోని కురుమద్దాల గ్రామంలో శనివారం ఆకస్మికంగా పర్యటించిన ఆయన పారిశుద్ధ కార్మికులతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి 48 గంటలలోపు తప్పనిసరిగా గ్రామ పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి క్రమబద్ధంగా చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రపరచడం వంటి కీలక పనుల్లో మెరుగుదల తీసుకురావాలని ఆదేశించారు. తడి చెత్త, పొడి చెత్త ను వేరువేరుగా సేకరించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. పారిశుధ్య కార్మికులు రోజువారి చెత్తను సేకరించడానికి ట్రక్ ఆటో కావాలని కోరగా పై అధికారులతో మాట్లాడి స్వచ్ఛ ఆంధ్ర మిషన్ లో భాగంగా కురుమద్దాలి పంచాయతీ పరిధిలో ట్రక్ ఆటోను త్వరితగతిన ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం మరింత శక్తివంతం చేయాలని, ప్రజలను రోడ్లపై వ్యర్థాలు వేయకుండా చూడటంతో పాటు తడి చెత్త, పొడి చెత్త గురించి మరింత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బుచ్చమ్మ ఆశ్రమంలో వైభవంగా ధ్వజస్థంభ పునఃప్రతిష్ట





**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్ శ్రీ కోదండ రామానందాశ్రమము (బుచ్చమ్మ ఆశ్రమం)లో శనివారం పున:శిల ధ్వజప్రతిష్ట వేడుకలు భక్తుల కోలాహలం నడుమ అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ధ్వజ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం యంత్ర స్థాపన, ధ్వజస్తంభ పునః ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అనువంశిక ధర్మకర్తలు నిమ్మగడ్డ వెంకటేశ్వర ప్రసాద్ – కృష్ణవేణి దంపతులు, నిమ్మగడ్డ రాజా గిరిధర్ కుమార్ – ఆషా దంపతులు, నిమ్మగడ్డ మురళీకృష్ణ – అనుపమ దంపతులు తమ దాతృత్వంతో ధ్వజస్తంభాన్ని అందజేశారు. బ్రహ్మశ్రీ వెలవలపల్లి వీరభద్ర శర్మ పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ చావలి నాగేశ్వరరావు శర్మ, ఆలయ అర్చకులు దివి నారాయణ చార్యులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, తూర్పు కృష్ణా డెల్టాప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామప్రసాద్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీరికి అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమాల అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# కురుమద్దాలిలో పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే





**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామంలో శనివారం జరిగిన నూతక్కి వెంకట బసవపూర్ణాదేవి పెద్దకర్మ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బసవపూర్ణాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదే గ్రామంలో లుక్కా కోటేశ్వరరావు ఇటీవల మరణించగా వారి గృహమునకు వెళ్లి ఆ కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన రాజులపాటి చైతన్య ఇటీవల అనారోగ్య కారణంగా విశ్రాంతి తీసుకుంటుండగా వారి గృహమునకు వెళ్ళి ఆయనను పరామర్శించారు. అనారోగ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని కుమార్ రాజా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవదీప్ అకాల మరణం పట్ల పలువురి సంతాపం...

### నివాళులర్పించిన ఎమ్మెల్యే కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు గురుమూర్తి తదితరులు







**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కనుమూరు గ్రామంలో మాజీ ఎంపీపీ దగ్గుపాటి ఉష ఫణీంద్రనాథ్ కుమారుడు నవదీప్ ప్రమాదవశాత్తు గోదావరి నదిలో మునిగి అకాల మరణం చెందటం పట్ల పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం కనుమూరులోని ఫణీంద్రనాథ్ నివాసం వద్ద జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి నవదీప్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఫణీంద్రనాథ్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం జరిగిన నవదీప్ అంతిమ యాత్రలో ఎమ్మెల్యే కుమార్ రాజాకి గురుమూర్తిలు కూడా పాల్గొన్నారు. అంత ముందుగా మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్, తోట్లవల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం, పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, రామినేని కుటుంబయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు నివాళులర్పించి పనేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# మహిళా చట్టాలు, పోక్సో చట్టాలపై అవగాహన





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** సమాజంలో రోజురోజుకీ పెరిగిపోతున్న పోక్సో కేసులు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. ఈ క్రమంలో పోక్సో కేసులలో విద్యార్ధులతో పాటుగా అవగాహన లేని డైలీ లేబర్, షాప్స్ లో పనిచేసుకునే వ్యక్తులు,ఆటో డ్రైవర్స్, బిల్డింగ్ వర్కర్స్, ఎక్కువగా ఇన్వాల్వ్ అయ్యి నిందితులు కాబడుతున్నారు. దీనిపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు వారి అదేశాల మేరకు డి.సి.పి. కె.జి.వి.సరిత పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ ఏ.సి.పి. డి.ప్రసాద్, ఇన్స్పెక్టర్ కె వాసవి, 2 ట్రాఫిక్ సిఐ సత్య రమేష్ ఆధ్వర్యంలో వారి వారి సిబ్బందితో కలిసి పండిట్ నెహ్రూ బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించి ఆటో డ్రైవర్ల కు, ప్రయాణికులకు పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈరోజు రోజుకీ ఏ.సి.పి. మాట్లాడుతూ చట్టంపై అవగాహన లేకపోవడం వల్ల/ మత్తు పదార్ధాలకు బానిసలు కావడం వల్ల/ వ్యామోహంతో మైనర్ బాలికలతో (18 సం.లు వయస్సు నిండని బాలికలను) ప్రేమ పేరుతో వెంటపడటం, వేధించటం, ప్రేమ,పెళ్ళి,లైంగిక చర్యలకు పాల్పడటం చేస్తున్నందున 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరాల వరకు కఠిన ఖారాగార శిక్షలు, అదేవిధంగా జీవిత ఖైదు వరకు కఠిన శిక్షల బారిన పడుతున్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండని మైనర్ బాలికలను ప్రేమ పేరుతో వెంటపడటం, వేధించటం, ప్రేమ, పెళ్లి.ఇతర లైంగిక చర్యలకు పాల్పడటం (వారి సమ్మతితోనైనా) చేసినట్లయితే ఫోక్సో చట్టం ప్రకారం నిందితులు అవుతారని సదరు ఫోక్సో చట్టంలో నిందితులకు మూడు సంవత్సరాల నుండి 20 సంవత్సరాల కఠిన ఖారాగార శిక్షలు అలాగే జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు విధింపబడతాయని, కనుక 18 సంవత్సరాలు వయసు నిండని మైనర్ల వెంటపడటం, వేధించటం, ప్రేమ, పెళ్లి, లైంగిక చర్యలకు పాల్పడటం చేయవద్దని హెచ్చరించడం జరిగింది.

# శ్రీ గంగానమ్మ తల్లి సేవలో విక్కుర్తి...





**కోడూరు మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరులో భక్తుల కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ గంగానమ్మ తల్లి వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారిని ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు, ఎఎ= ఫౌండేషన్ చైర్మన్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు దర్శించుకున్నారు. శ్రీ గంగానమ్మ తల్లి 51వ జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అమ్మ వారి దర్శనానికి వచ్చారు.వార్షిక జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని శు క్రవారం సాయంత్రం శ్రీ గంగానమ్మ అమ్మవారిని విక్కుర్తి శ్రీనివాస్, విక్కుర్తి రాంబాబులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు విక్కుర్తి సోదరులను సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం శ్రీ గంగానమ్మ తల్లి వార్షిక జాతరను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులను ఈ సందర్భంగా విక్కుర్తి శ్రీనివాస్ అభినందించారు.దివిసీమ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా భక్తుల చేత పూజలు అందుకుంటున్న శ్రీ గంగానమ్మ అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ పాడి పంటలతో, సుఖ సంతోషాలతో మంచిగా ఉండాలని ఈ సందర్భంగా అమ్మవారిని కోరుకున్నట్లు విక్కుర్తి శ్రీనివాస్ తెలిపారు..



## అన్నా క్యాంటీన్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ శనివారం రాత్రి విజయవాడలోని విద్యాధరపురం అన్నా క్యాంటీన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌కు వచ్చిన లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్యాంటీన్ సమయపాలన, ఆహార నాణ్యత, సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే అంశంపై ప్రత్యేకంగా ఆరా తీశారు. అనంతరం టోకెన్ కౌంటర్, ఆహార వడ్డింపు కేంద్రం, డైనింగ్ ప్రాంగణం, తాగునీటి సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించారు. ఆహారాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఫీడ్ బ్యాక్ ఇచ్చే వ్యవస్థను పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని సిబ్బందిని ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని సమయానికి అందించాలని స్పష్టం చేశారు.

## ముస్లిం సోదరులకు వెన్నంటి నిలుస్తాం

### వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అవుతు శ్రీనివాస రెడ్డి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అవుతు శ్రీనివాస రెడ్డి ని మర్యాదపూర్వకంగా పలువురు మైనారిటీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ పండగ శుభాకాంక్షలు తెలియచేయటంతోపాటు, పదవులతో సంబంధంలేకుండా ఎల్లపుడు అందుబాటులో ఉంటామని, ముస్లిం సోదరులకు ఏ అవసరం వచ్చిన వెన్నంటి నిలుస్తామని భరోసా అందించారు. ఈ కార్యక్రమంలో 58 వ డివిజన్ అధ్యక్షులు రాజా రెడ్డి, మైనారిటీ నాయకులు వలి, అర్మన్, సుభాని, ఇర్ఫాన్, రబ్బానీ, ఆరిఫ్, షరీఫ్, బాషా, అహ్మద్, మోను వాసిమ్ పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో కలెక్టర్ లక్ష్మీశ తనిఖీలు

## వైద్యసేవలతో పాటు యూత్ టైం బ్యాంకు సేవల పరిశీలన







**విజయవాడ, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ శనివారం విజయవాడలోని న్యూ జీజీహెచ్‌ను సందర్శించి ఆసుపత్రి ద్వారా రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అదేవిధంగా ఆసుపత్రిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యూత్ టైం బ్యాంక్ సేవలను ఈరోజు పరిశీలించారు. ఈరోజు యూత్ టైం బ్యాంక్ సేవల్లో భాగంగా నలంద డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ 31 మంది వాలంటీర్లు, వాసవ్య మహిళా మండలి వాలంటీర్లు ఆసుపత్రికి వచ్చిన రోగులకు సేవలు అందించారు. ఆసుపత్రిలోని ఓపీడీ కౌంటర్, క్యాజువాలిటీ వార్డు, ఫార్మసీ, ఎక్స్‌రే, జనరల్ సర్జికల్ ఓపీ, ఆర్థో ఓపీ, న్యూరో వార్డ్, మెయిన్ బ్లాక్, డా. ఎన్టీఆర్ వైద్యసేవ తదితర ప్రాంతాల్లో టైం బ్యాంక్ వాలంటీర్లు ఎంతో ఉత్సాహంగా సేవలు అందించగా కలెక్టర్ లక్ష్మీశ సంతృప్తి వ్యక్తం చేశారు. యూత్ టైం బ్యాంక్ మొబైల్ యాప్‌ను పరిశీలించి వాలంటీర్, రోగి వివరాలు టైం బ్యాంకులో నమోదయ్యే విధంగా చర్యలు చేపట్టారు. ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వాములు అయిన వాలంటీర్లను కలెక్టర్ లక్ష్మీశ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డా. కొల్లేటి రమేష్, సూపరింటెండెంట్ డా. ఏడుకొండలు, నలంద కళాశాల యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ సుబ్బారావు, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ కనకరాజు, ఆసుపత్రి అధికారులు, వాసవ్య మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలూ.. ఆందోళన వద్దు...







### పంట నష్టానికి పరిహారం ద్వారా ప్రభుత్వం భరోసా

### కొనుగోలు కేంద్రాల ద్వారా కూడా మద్దతుకు చర్యలు

### ఎన్‌టీఆర్ జిల్లాలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సుడిగాలి పర్యటన

**ఎన్‌టీఆర్ జిల్లా, మార్చి 21, మేజర్ న్యూస్ :** అకాల వర్షాలు, గాలులు కారణంగా నష్టపోయిన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని.. జరిగిన నష్టానికి ప్రభుత్వం పరిహారం ద్వారా అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ భరోసా కల్పించారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సందర్శించి నష్టం వాటిల్లిన పంటలను పరిశీలించి.. రైతులతో మాట్లాడారు. గంపలగూడెం మండలంలోని తునికిపాడులో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఇక్కడ దాదాపు 116 హెక్టార్లలో ఈ పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనావేసినట్లు వ్యవసాయ అధికారులు వివరించారు. పంట సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపైనా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మేడూరులో ఎనీటైమ్ మనీ (ఏటీఎం) విధానంలో పండిస్తున్న పంటలను పరిశీలించారు. రైతులకు ఏడాదిపాటు ఎప్పుడూ ఏదో ఒక రూపంలో పంటల ద్వారా ఆదాయం వచ్చే ఈ విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. దీనివల్ల పంటల వైవిధ్యంతో పాటు ఆదాయ స్థిరత్వం పెరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా 50 సెంట్ల విస్తీర్ణంలో సేంద్రియ విధానంలో సాగుచేస్తున్న వరిపంటను కూడా పరిశీలించి సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువులు, దిగుబడి పరిస్థితులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రసాయనాల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తికి దోహదపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వినగడప వద్ద కట్లేరుపై ఉన్న వంతెనను పరిశీలించారు. ఎ.కొండూరు మండలం చైతన్య నగర్ సమీపంలో ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మార్కెట్ యార్డును రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ సావల దేవదత్ తదితరులతో సందర్శించారు. కంచికచర్ల మండలంలోని కీసర వద్ద అరటి తోటను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అకాల వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని.. వివిధ పంటలకు సంబంధించి పారదర్శకంగా, జవాబుదారీతనంతో పంట నష్టాలను అంచనా వేయడం జరుగుతోందని.. తుది నివేదికల ఆధారంగా పరిహారం అందుతుందని, అన్నదాతలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కూడా త్వరలోనే ఏర్పాటు చేసేందుకు చొరవచూపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పెసర, కంది వంటి పంటలకు కూడా మద్దతు ధర లభించేలా కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, గంపలగూడెం వ్యవసాయ అధికారి వి.హరీష్, రైతు సమాఖ్యల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.









# రైజ్ ఆధ్వర్యంలో నేటివ్ అరకు కాఫీ వర్క్‌షాప్





### ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన

### మహిళల సాధికారతకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రోత్సాహం

**విజయవాడ రూరల్, మార్చి 21, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి డీఆర్‌డీఏ కార్యాలయంలో రైజ్ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నేటివ్ అరకు కాఫీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. గ్రామీణ మహిళలలో స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, ఆర్థికంగా స్వావలంబన దిశగా ముందుకు నడిపించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో 102 మంది స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు పాల్గొనగా.. నేటివ్ అరకు కాఫీ సంస్థ సీఈవో రామ్ కుమార్ వర్మ ప్రస్తుతం కాఫీ రంగంలో ఉన్న విస్తృత అవకాశాలపై సమగ్రంగా వివరించారు. అరకు ప్రాంతానికి చెందిన కాఫీ ప్రత్యేకతలు, సహజ పద్ధతుల్లో సాగు, నాణ్యమైన గింజల ఎంపిక, ప్రాసెసింగ్ విధానాలతో పాటు పలు సాంకేతిక అంశాలను వివరించారు. అదేవిధంగా విలువ ఆధారిత కాఫీ ఉత్పత్తుల తయారీ విధానాలపై అవగాహన కల్పించారు. మార్కెటింగ్ పరంగా స్థానిక మార్కెట్లు, బ్రాండింగ్, ప్యాకేజింగ్ ప్రాధాన్యత, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కొత్త రంగాలలో నైపుణ్యాలను సంపాదించి, స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. రైజ్ కేంద్రం ద్వారా మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించే కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**గన్నవరం, మార్చి 21, మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో లైన్ మెయింటినెన్స్ వర్క్, న్యూ లైన్ ఏరెక్షన్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును. ఆదివారం ఉదయం 08:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసిపిడిసిఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు వీరపనేనిగూడెం, తెపల్లి, బల్లిపర్రు ఆ ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును. కావున గృహ వినియో దారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని కోరారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999